క్లుప్తంగా

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు



హజరత్ సయ్యద్ షా రఫివుల్లా షా ఖాద్రీ దర్గా

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పలగా డివీధిలో వెలసిన హజరత్ సయ్యద్ షా రఫివుల్లా షా ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు జరుగనున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ షా సీరాజ్‌ద్దీన్ తెలిపారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా స్వామి ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ శనివారం నిషాన్, ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్‌తో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. 1, 3వ తేదీలలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తారని భక్తులు తరలిరావాలన్నారు.

63.6 మి.మీ. వర్షపాతం నమోదు



వృక్షం కూలడంతో విరిగిన ప్రహారి గోడ

కమలాపురం : మండలంలో 63.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి భారీ గాలులతో పాటు పిడుగుల వర్షం గంట పాటు ఏకధాటిగా కురిసింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వివిధ గ్రామాల్లో 60 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యాసాగర్ తెలిపారు. అలాగే ముస్లిం సశ్మాన వాటికలో, రామ్‌నగర్‌లో తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలు చోట్ల చెట్లు విరిగి పడటంతో ఇంటి ప్రహారీ గోడలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు వాటర్ ప్లాంట్లు ప్రారంభం

సింహాద్రిపురం : మండల పరిధిలోని కోవరం గుంటపల్లె, అంకాలమ్మ గూడూరు, దుద్దేకుంట్ల, నంద్యాలంపల్లె, సుంకేసుల గ్రామాల్లో పాడా నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్లను శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వల్లూరు : నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 11 మందికి ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి రూ.13 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందచేశారు. వీరి తో పాటు ఎల్‌ఓసీ కింద మరో వ్యక్తికి రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారని వివరించారు.

ఎర్రగుంట్లలో స్వచ్ఛతోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతోత్సవ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలివరకు సాగింది. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సందీప్, టీపీఓ ఇందిర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సీఓలు విమల, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

చల్లనీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామంలో చల్లనీటి శుద్ధి కేంద్రంను శుక్రవారం రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సర్పంచు అనూరాధ గ్రామస్తులతో కలసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రాన్ని దాదాపు రూ.80 వేల వ్యయంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం చెన్నూరుకు రానున్నట్లు ఏపీఎం గంగాధర్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దాన ధర్మాల మాసం రంజాన్



కమలాపురం ఖాదరియా మస్జిద్‌లో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు (ఫైల్‌ఫొటో)

కమలాపురం : ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం రమదాన్. ఈ మాసాన్ని దాన ధర్మాల మాసంగా చెప్పవచ్చు. అసలు ఈ మాసం అంతా ఒక శిక్షణ కాలం వంటిది. ఇస్లామియ బోధనలు, ప్రమాణాల ప్రకారం జీవితాన్ని గడిపే శిక్షణ నిచ్చే మాసం. ఈ మాసం అనంతరం వచ్చే 11 నెలల కాలంలో కూడా ముస్లింలు ఇదే పద్ధతిలో జీవించడం అలవడుతుంది. ఆరాధనల విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయవలసిన నమాజ్, రోజా, జకాత్, హజ్ వంటి ఆరాధనలే కాదు, దేవుని ప్రసన్నత కోసం ఖురాన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పని ఆరాధన కిందికే వస్తుంది. రమదాన్ మాసంలో చేసే ఏ పనులకైనా 70 రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది. ఒక్క రుపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని ముస్లిం మహనీయులు చెప్పేవారు. అందుకే ఈ మాసంలో ముస్లింలు అత్యధికంగా దాన ధర్మాలు చేస్తుంటారు. దీంతో ఈ మాసంను దానధర్మాల మాసంగా చెప్పవచ్చు.

దాన ధర్మాలు రెండు రకాలు:

ఇస్లాంలో దాన ధర్మాలు రెండు రకాలు. ఒకటి తప్పని సరిగా చేయవలసిన దానం 'జకాత్'. జకాత్ అంటే శాబ్దిక అర్థం శుభ్రం చేయడం. తన వద్ద ఉన్న సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లించడం ద్వారా సంపదను శుద్ధి చేసుకోవడం.

రమదాన్ మాసంలో తప్పని సరిగా చేసే మరో దానం 'ఫిత్రా'. రమదాన్ మాసం తర్వాత రోజు ఈద్ నమాజ్ కన్నా ముందు ఫిత్రా తప్పని సరిగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరి పేరిట ఫిత్రా దానం తప్పని సరిగా చేయాలి. రెండు కిలోల 50 గ్రాముల ధాన్యం లేదా గోధుమలు లేదా వాటి మార్కెట్ ధరకు సరిపడ డబ్బు పేదలకు దానం చేయాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో తప్పనిసరి చేశారు. సమాజంలో దురదృష్ట వంతులు, నిర్భాగ్యులైన వారిని ఆదుకోవడానికి దాన ధర్మాలు చేయాలని ఇస్లామ్ బోధిస్తుంది. అందుకే ముస్లింలు రమదాన్ మాసంలో ఇతోధికంగా దాన ధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడరు.

ముస్లిం దేశాల్లో జకాత్ వసూలు ప్రభుత్వ పరంగా జరుగుతుంది. కొన్ని ముస్లిం దేశాల్లో స్వతంత్ర సంస్థలు ఈ పని చేస్తాయి. ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రమే ఉంటుంది. ముస్లిమేతర దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు జకాత్ వసూలు చేయడం లేదా ముస్లింలు వ్యక్తిగతంగానే జకాత్ అవసరమైన వారికి ఇస్తారు. స్వచ్ఛంధ సంస్థలు జకాత్ వసూలు చేసి సేవా, విద్య, వైద్యం తదితర కార్యక్రమాలకు వినియోగిస్తారు. ఇండియాలో జకాత్ ఫౌండేషన్ సివిల్ సర్వీసు కోచింగ్ వంటి సేవలు కూడా అందిస్తుంది. సమాజంలో సంపద పంపిణీకి జకాత్, సదఖాలు గొప్ప సాధనాలు. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం సాధించడానికి ఇవి ఎంతైనా తోడ్పడతాయి. దాంతో పాటు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో కష్టాలపాలైన నిర్భాగ్యులను ఆదుకోవడానికి కూడా ఈ జకాత్ నిధులు ఉపయోగ పడుతున్నాయి.

రూ.1 దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం



రమదాన్ మాసంలో రూ.1 దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం సోదరుడు జకాత్ తప్పని సరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లు కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవడానికి ఈ జకాత్ చెల్లించాలి.

– సయ్యద్ నాసీర్ హుసేనీ, ప్రభుత్వ ఖాజీ, కమలాపురం.

ఫిత్రా దానం చేయాలి



ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌కు వెళ్లే ముందుకు ప్రతి ముస్లిం తన పేరిట ఫిత్రా పేదలకు దానం చేయాలి. కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరి పేరు మీద ఫిత్రా దానం చేయాలి. కడుపులో ఉన్న శిశువుతో సహా ఫిత్రా చెల్లించాలి. ఫిత్రా 2.050 కిలోల గోధుమలు, లేదా వాటి మార్కెట్ ధరకు సమానంగా (రూ.110) ఫిత్రా దానం చేయాలి.

– ఖాజీ సయ్యద్ గయాసుద్దీన్, హాఫిజె ఖురాన్, కమలాపురం.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తప్పవు



వేంపల్లెలో అక్రమ లే అవుట్లను పరిశీలిస్తున్న అధికారి కృష్ణసింగ్, తదితరులు

వేంపల్లె : మండల పరిధిలోని ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పడిన లే అవుట్లపై ప్రభుత్వపరమైన చర్యలు తప్పవని అన్నమయ్య డెవలప్‌మెంట్ అథారటీ అసిస్టెంట్ అధికారి కృష్ణసింగ్ హెచ్చరించారు. శుక్రవారం వేంపల్లెలో స్థానిక పంచాయతీ కార్యదర్శులతో కలిసి అనుమతిలేని లే అవుట్లను గుర్తించి రాళ్లను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే లే అవుట్లకు మరియు భవన నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అనుమతిలేని లే అవుట్లను, భవనాలను తొలగించేందుకు వెనకాడే ప్రసక్తే ఉండదన్నారు. 300 చదరపు మీటర్ల వరకు పంచాయతీ కార్యదర్శుల వద్ద అనుమతి తీసుకోవాలని, ఆపైన ఉన్న లే అవుట్లు, భవనాలకు అనుమతి తీసుకోవాలంటే అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీని సంప్రదించాలని కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం(రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైఎస్ మధురెడ్డి

తొండూరు : మండల పరిధిలోని కోరవానిపల్లె గ్రామంలో రూ.8.50 లక్షల పాడా నిధులతో నిర్మించిన ఆర్‌ఓ వాటర్ ప్లాంటును వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏళ్ల నుంచి తొండూరు, బూచుపల్లె, మల్లేల గ్రామాలకు వెళ్లి మినరల్‌వాటర్ తెచ్చుకునేవాళ్లమని.. ఇప్పుడు ఆ సమస్య తీరిందని గ్రామస్తులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామంలో పలు ఆలయాల నిర్మాణానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ మధురెడ్డి, వేదపండితులు చిలంకూరు శర్మల ఆధ్వర్యంలో భూమిపూజలు నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎండోమెంట్ ద్వారా సీతారాముల ఆలయానికి రూ.5లక్షలు, శ్రీకృష్ణాలయానికి రూ.5లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, శీతల గిడ్డంగుల రాష్ట్ర డైరెక్టర్ సురేష్‌రెడ్డి, డైరెక్టర్ శంకర్, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌శంకర్, కో అప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు గురుమోహన్ రెడ్డి, గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి ఊరేగింపు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లి ఆవుల పబ్బం (గంగ జాతర) మహోత్సవం మూడవ రోజున గంగమ్మతల్లి ఊరేగింపు ఘనంగా జరిగింది. కేరళ డ్రమ్స్‌తో నిర్వహించిన కోలాటం ఆకర్షణగా నిలిచింది. అలాగే గంగ జాతర సందర్భంగా శనివారం ఉదయం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కల్తీ ఆహారం లేకుండా జాగ్రత్తలు పాటించాలి



శిక్షణలో సలహాలు అందిస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : హోటళ్లలో కల్తీ ఆహారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని యజమానులకు జిల్లా ఆహార భద్రతాధికారి జి.ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రొద్దుటూర్ రహదారి లో ఉన్న దర్బార్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో హోటల్స్, బేకరీలు, కూల్‌డ్రింక్స్‌షాపు, ఐస్‌క్రీమ్ వ్యాపారస్తులకు ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ శిక్షణ తరగతులను నిర్వ హించి సూచనలు, సలహాలు అందించారు. యజమానులు కల్తీకాని, కాలంచెల్లిన వాటిని విక్రయించరాదన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య సంరక్షణ

వల్లూరు : పోషకాహారంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి అవకాశం వుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి వివరించారు. చిరుధాన్యాలతో చేసుకునే ఆహార పదార్థాలను గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ పవన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని ఇంటిలిజెన్స్ ఎస్‌ఐ బి.హేమకుమార్, సీకే దిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని బయనపల్లిలోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు విడ్కోలు సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఎస్‌ఐ బి.హేమకుమార్ పరీక్ష రాసేందుకు సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.దీనదయాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.పవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కడప అర్బన్ : జిల్లాలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్స్ టి. రెడ్డెప్ప, పి. రామకృష్ణ, ఏఈఈ కె. విజయకిషోర్, వి.అశోక్‌కుమార్ వివిధ బృందాలుగా ఏర్పడి ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని వివిధ ఆశ్రమాలు, నిలయాలలో శుక్రవారం తనిఖీలు చేశారు. చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లెలోని ఆశా నిలయం(బాలికలు), ఆశా నిలయం(బాలురు), కొండాయపల్లిలోని స్పెషలైజ్‌డ్ అడాప్షన్ ఏజెన్సీ, కడప కేంద్ర కారాగారం సమీపంలోని మా అమ్మ ఒడి, అక్కాయపల్లిలోని రీజనల్ చిల్డ్రన్ హోంలలో ఈ తనిఖీలను చేపట్టారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు అక్కడి వసతులు, భోజన, వైద్య సదుపాయాలు, విద్యార్థుల హాజరు, రక్షణ, నిర్వహణ, రికార్డులను పరిశీలించి తగిన నివేదికను తయారు చేశారు. సదరు నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామనీ అధికారులు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వల్లూరు : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని దిగువపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అంబవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకున్నా, ఏవైనా ఇతర సమస్యలు వున్నా తెలపండి వాటిని పరిష్కరిస్తామని ఆయన ప్రజలను కోరారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరగా మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు మల్లికార్జునరెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సానారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ రఘు, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఓ సాయిజ్యోతి, ఏఈలు, ఏపీఎం శైలజ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముద్దనూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరించడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముద్దనూరులోని ఎస్వీగిరి కాలనీలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని కాలనీ వాసులు సమస్యలను తెలుసుకున్నారు. ఇంటిస్థలాలు, పక్కా గృహాలు, సిమెంటు రోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. అర్హులైన వారందరినీ గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో డ్వాక్రా మహిళలకు రూ.6,39,24,134 వైఎస్సార్ ఆసరా సొమ్ము చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు దగ్గరైన ప్రభు త్వమని, పథకాలన్నీ మహిళల ఖాతాల్లోకే చేరుతున్నా యని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళతో కలసి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమంత్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, వైస్ ఎంపీపీలు, రేణుక, పుష్పలత, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ఉమాదేవి, సర్పంచ్‌లు అరుణమ్మ, వరప్రసన్న, పార్టీ నాయకులు బడుగు నరసింహులు, పుల్లయ్య, వీరాంజనేయరెడ్డి, కుమారస్వామి, రమేష్, బద్రి, వినయ్, రమణ, రామాంజనేయులు, నరసింహులు, విశ్వనాథ్, ఎంపీడీవో రమణారెడ్డి, వెలుగు ఏసీ ధనుంజయ, ఏపీఎం ఇబ్రహీంలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

కొండాపురం : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో కూలీలకు పనులు కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అడిషనల్ పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2021 ఏప్రిల్ నుంచి మార్చి 2022 వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్‌శాఖలలో జరిగిన రూ.5.37 కోట్ల పనులపై సోషియల్ ఆడిట్ ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించారు. తనిఖీల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.8,842 రికవరి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయులు, క్వాలిటీ అధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి ఏపీఓ రాజాసాహెబ్, ఈసీ ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా పారిశుధ్య, ఘన పదార్థాల నిర్వహణలో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్దీకరణ, తడి, పొడి చెత్త వినియోగంపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, అసోసియేషన్లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్లు వైఎస్ ప్రమీలమ్మ, డి.రుక్మిణమ్మలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని పురవీధుల గుండా సాగింది. అంతకమునుపు అందరిచేత స్వచ్ఛ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి





డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు, హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న లక్ష్యమని.. ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్న లక్ష్యంతో వైఎస్సార్ ఆసరా పథకం మంజూరు చేయడం జరిగిందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వీజే ఫంక్షన్ హాలులో మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు సమావేశం నిర్వహించారు. అంతకుమునుపు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిండి వంటల స్టాల్స్‌ను ఎంపీ పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం కింద 75 శాతం డ్వాక్రా రుణ మాఫీ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా మూడవ విడతలో రూ.78 లక్షల మంది మహిళలకు నిధులు జమకావడం జరిగిందన్నారు. నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా రుణాలు వచ్చే ఏడాది జనవరి నాటికి ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పులివెందుల నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు నాలుగు వరుసల రహదారుల ఏర్పాటుకు సీఎం చిత్తశుద్ధితో పనులు చేయిస్తున్నారన్నారు. అలాగే ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా ముదిగుబ్బ వరకు రైలు మార్గాలకు సర్వే పనులు చేస్తున్నారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఏపీ కార్ల్‌లో అగ్రికల్చర హార్టికల్చర్, వెటర్నరీ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పథకాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నకు మీ ఆశీర్వాదాలు కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనందయ్య, చైర్మన్లు వరప్రసాద్, చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వేముల మండల నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, కౌన్సిలర్లు, ఏపీఎంలు, మెప్మా అధికారులు, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం చీనీ కొనుగోలు కేంద్రాలు

పులివెందుల రూరల్ : బత్తాయి రైతుల కోసమే చీనీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చీనీ కొనుగోలు కేంద్రాలను ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల ప్రకారం చీనీ రైతుల ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డులో 10 కొనుగోలు కేంద్రాలను సుమారు రూ.26 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్థానిక వీజే ఫంక్షన్ హాలులో ఎంపీ, పాడా ఓఎస్డీలు వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన రూ.1.70 కోట్లకుపై విలువ చేసే పంపు సెట్లను రైతులకు పంపిణీ చేశారు. సింహాద్రిపురం మండలానికి 20, వేముల మండలానికి 4 పంపు సెట్లతోపాటు బోరు వేసినందుకు విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చు నిధులు జూరయ్యాయి. అలాగే మండలానికి నూతనంగా మంజూరైన 104 వాహనాన్ని ఎంపీ, పాడా ఓఎస్డీ, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీ అజాద్‌వల్లి, ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ మేఘనాథ్, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఏపీడీ శివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డి, మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీఓలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.